


నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

**రిపోర్టర్లు కావలెను**

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.




Contact Number
9059328777

రంగారెడ్డి శనివారం 18-07-2026 సంపుటి: 02 సంచిక : 77 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday, 18-07-2026 Volume :02 Issue: 77 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





## ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా బార్ల సమయం పొడిగింపు

- ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా హైదరాబాద్‌లో బార్ల వేళ పొడిగింపు
- ఫైనల్ మ్యాచ్ రోజు తెల్లవారుజాము 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి
- మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 గంటల వరకు పర్మిషన్
- ఫుట్‌బాల్ అభిమానుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్

బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థనకు ఆమోదం ఫీఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు. ఫీఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి

-మిగతా 2 లో



## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

- 85% మరణాలు వృద్ధులే
- మరింత పెరగనున్న మరణాలు
- హెచ్చరిస్తున్న నిపుణులు

2లో



## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

- 22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో
- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు
- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం
- ఇంటెలిజెన్స్ నివేదికలు డీక్లాసిఫై చేసినట్లు వెల్లడి

2లో

# ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

### ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం ప్రారంభం

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఆరోగ్య భద్రతా వ్యవస్థను అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని గమనించామని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శుక్రవారం డాక్టర్

-మిగతా 2లో

- 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు వర్తింపు
- 886 ప్రయివేటు ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం
- సీజీహెచ్ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు :ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇది మైలురాయి : దామోదర రాజనర్సింహ
- జేఏసీ నేతలకు డిజిటల్‌ఆరోగ్య కార్డుల అందజేత



# కరువుపై కేంద్రానికి లేఖ

### రాష్ట్రానికి ప్రత్యేక బృందాన్ని పంపాలని విజ్ఞప్తి

- రైతాంగం నీటి సౌకర్యం చూసుకొని పంటలు వేసుకోవాలి
- ధరణి అక్రమాలపై సిట్ విచారణ
- 2020 నుంచి భూ లావాదేవీలపై ఫోరెన్సిక్ దర్యాప్తు
- ఇంజనీరింగ్ పనులకు యూనిఫైడ్ టెండర్ విధానం
- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు చోటు
- జీపీ నిధులు ఇక స్థానిక బ్యాంకుల్లోనే జమ
- కరువు పరిస్థితిపై 20న జిల్లాల వారీగా సమీక్షలు
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ నిర్ణయాలు పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగు, సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను ఆ లేఖలో సమగ్రంగా వివరించనున్నారు. ఇక్కడి పరిస్థితుల్ని పరిశీలించి, కరువు తీవ్రతను అంచనా వేసేందుకు తక్షణం రాష్ట్రానికి కేంద్రం నుంచి ప్రత్యేక బృందాన్ని పంపాలని కోరారు. అలాగే రాష్ట్రానికి ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలు కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని మంత్రివర్గం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రివర్గ నిర్ణయాలను రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియాకు వివరించారు.

-మిగతా 2 లో





## తెలంగాణ దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

- రవీంద్రభారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత
- దేవాలయ సేవ ఉద్యోగం కాదు.. భగవంతుని సేవచేసే పవిత్ర బాధ్యత : మంత్రి కొండా సురేఖ
- ఆధ్యాత్మిక సేవలు, ఉద్యోగుల సంక్షేమం, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్

తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో అరుదైన ఘట్టానికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేవాదాయ శాఖలో 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాహన పూజ పురోహితులు, అసిస్టెంట్ కుక్కలు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన అభ్యర్థులకు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, దేవాలయ సేవను ఉద్యోగంగా కాకుండా భగవంతునికి సేవ చేసే పవిత్ర బాధ్యతగా భావించాలని కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచించారు. భక్తులే భగవత్సేవ అనే భావనతో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, ఆగమ సంప్రదాయాల పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. 'అర్చకులు, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా ఉద్యోగులకు మరింత మెరుగైన సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో

-మిగతా 2 లో




## వందేమాతరం గేయానికి ఇక చట్టబద్ధ రక్షణ

### గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష


- జాతీయ గీతంతో సమానంగా ప్రత్యేక గుర్తింపు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశానికి కసరత్తు
- ఉద్దేశపూర్వక అడ్డుతగిలితే తీవ్రమైన నేరం
- 1971 నాటి చట్టం పరిధిని విస్తరించనున్న కేంద్రం
- చట్టరూపం దాల్చితే చారిత్రక ఘట్టం

న్యూఢిల్లీ

భారత స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించిన అమర గేయం 'వందేమాతరం'కు ఇకపై చట్టబద్ధమైన గట్టి రక్షణ లభించనుంది. భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ప్రస్తుతం చట్టపరంగా ఉన్న గౌరవ మర్యాదలు, రక్షణలన్నింటినీ వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా 1971 నాటి 'జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం'కు కీలక సవరణలు చేసే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ప్రకారం.. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గేయాన్ని అవమానించినా లేదా దాన్ని ఆలపించేటప్పుడు అడ్డుతగిలి అలజడి సృష్టించినా అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.

-మిగతా 2 లో

## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ




- ఆర్‌బీఐ కీలక సన్నాహాలు
- తొలి దశలో రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు
- ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- 2027 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి?
- పాత నోట్లతో పాటే పాలిమర్ కరెన్సీ వినియోగం

న్యూఢిల్లీ,

ప్లాస్టిక్ కరెన్సీని భారత్‌లో ప్రవేశపెట్టేందుకు ఆర్‌బీఐ సన్నాహాలు చేస్తున్నది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రూ. 20, రూ. 10 లాంటి తక్కువ విలువ కలిగిన నోట్లను తొలి దశలో ప్రవేశపెడుతుంది. వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించి, అది పూర్తిగా విజయవంతమైతే తర్వాత పెద్ద నోట్లు విడుదలపై నిర్ణయం తీసుకుంటుంది.

-మిగతా 2 లో

## నేడే నింగిలోకి విక్రమ్-1

- ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్
- దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి
- 350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం



2లో



## గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

- ఐదుగురు జైషే ఉగ్రవాదుల అరెస్ట్
- ఏటీఎస్ అదుపులో జైషే ముష్కరులు
- జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ
- క్రూడ్ ఐఈడీ బాంబు తయారీకి యత్నం
- ఉపా చట్టం కింద కేసులు
- పాక్ ఉగ్ర నెట్‌వర్క్ గుట్టురట్టు
- విచారణలో బయటపడిన కీలక వివరాలు

న్యూఢిల్లీ

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కి చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని బిలాల్ అబ్దుల్లా షే, మహమ్మద్ ఆయాజ్ కడివాలా, మహమ్మద్ షాన్‌పురి, షఫియా రయిస్ ముక్తి, మహమ్మద్ హసన్ క్రియాగా గుర్తించారు. నిందితులను మెహసానా జిల్లాలోని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్

-మిగతా 2 లో

# తెలంగాణ దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

మొదటి తరువాయి

ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు నిర్వహించేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని, దేవాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులకు పనితీరు ఆధారంగా అవార్డులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, సీటా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చక ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నియామక పత్రాలు అందుకున్న పలువురు అభ్యర్థులు తమ చిరకాల కల నెరవేరిందంటూ భావోద్వేగానికి గురయ్యారు.

## వందేమాతరం గేయానికి ఇక చట్టబద్ధ రక్షణ

మొదటి తరువాయి

పార్లమెంట్ వేదికగా చారిత్రక అడుగు

రానున్న జూలై 20 నుంచి ప్రారంభం కాబోతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ సరికొత్త సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ బిల్లు గనుక ఉభయ సభల ఆమోదం పొంది చట్టంగా మారితే, భారత న్యాయ చరిత్రలో వందేమాతరం గేయానికి ప్రత్యక్ష చట్టబద్ధమైన రక్షణ లభించడం ఇదే తొలిసారి అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 1971 నాటి చట్టం కేవలం భారత జాతీయ పతాకం, భారత రాజ్యాంగం, జాతీయ గీతం (జనగణమన)లకు మాత్రమే చట్టపరమైన రక్షణ కల్పిస్తోంది. ఇప్పుడు ఆ పరిధిని మరింత విస్తృతం చేస్తూ వందేమాతరాన్ని కూడా ఇందులో చేర్చనున్నారు.

ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం.. ఎవరైనా జాతీయ గీతాన్ని ఆలపించకుండా అడ్డుకున్నా, పాడే సమయంలో కావాలని గందరగోళం సృష్టించినా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా, లేదంటే ఈ రెండూ విధించే అవకాశం ఉంది. ఇప్పుడు తీసుకురాబోతున్న కొత్త సవరణ ద్వారా ఇదే శిక్షా నిబంధనలను వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయనున్నారు. అయితే ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చాలంటే ముందుగా పార్లమెంట్లోని లోక్‌సభ, రాజ్యసభలలో సుదీర్ఘ చర్చలు జరిగి, ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి సంతకం కావాల్సి ఉంటుంది.

రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న నిర్ణయం

గతంలో 'సెక్యులరిజం' పేరుతో పాలించిన ప్రభుత్వాలు వందేమాతరం గేయానికి ఇవ్వాల్సిన అసలైన గుర్తింపును ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ దీర్ఘకాలంగా వాదిస్తోంది. భారత స్వాతంత్ర్య పోరాటంతో ఈ గేయానికి ఎంతో చారిత్రక అనుబంధం ఉన్నప్పటికీ, కొన్ని వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాల కారణంగా గత పాలకులు దీనికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ప్రస్తుత పాలక వర్గం భావిస్తోంది. ఇటీవలి కాలంలో కొన్ని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, కొన్ని ప్రత్యేక వర్గాల కార్యక్రమాల్లో వందేమాతరం గేయానికి ఆశించిన స్థాయిలో గౌరవం దక్కలేదనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకురాబోతున్న ఈ బిల్లులో 'అవమానం' అనే పదాన్ని ఏ విధంగా నిర్వచిస్తారనే అంశంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

మొదటి తరువాయి

ఆర్.ఎం భటియా ముందు గుజరాత్ ఏటీఎస్ అధికారులు హాజరుపరిచారు. ఈ ఐదుగురిని జులై 24 వరకు గుజరాత్ ఏటీఎస్ కస్టడీకి ఆర్.ఎం భటియా అప్పగించారు.


నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు:

గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న జులై 3న ఏటీఎస్ టీమ్ 8 మంది ఉగ్రవాదులు చిక్కారు. ఆ ఎనిమిది మంది ముష్కరులను విచారించగా ఈ ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒకరు క్రూడ్ ఐఈడీ బాంబును తయారు చేసి, దానిని పరీక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుజరాత్ ఏటీఎస్ అధికారులు తెలిపారు. ముందస్తుగా అరెస్ట్ అయిన ఎనిమిది మందిలోని ఒకరు ముష్కరుడు ఈ బాంబు తయారీ సామగ్రి అందించినట్లు గుర్తించామని వెల్లడించారు. జైషే మహమ్మద్ తన ఉగ్ర కార్యకలాపాలను మరింతగా వ్యాప్తి చేయడానికి గుజరాత్‌లో ఒక క్రియేటివ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు నిందితులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని సెక్షన్ 13, 17, 18, 38, 39, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 148, 61 కింద కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

అరెస్ట్ అయిన ఐదుగురిలో ఒకరు బాంబు తయారు చేయడానికి ప్రయత్నించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ డంకాని కోర్టుకు తెలిపారు. అందుకే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఏటీఎస్ కోరుతుందని చెప్పారు. బాంబు తయారీ సామగ్రి, ఉర్దూ భాషలో ఉన్న జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యాన్ని సంబంధించిన పుస్తకాలను ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నిందితులు ఒక సాదా రం ఐఈడీ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించారని, అయి తే ఆ ప్రయత్నం విఫలమైందని వెల్లడించారు. వారు బాంబు తయారీ సామగ్రి ఎక్కడ సేకరించారు? దానిని ఎక్కడ దాచి పెట్టారు? జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించి పుస్తకాలను నిందితులు ఎలా పొందారు? అనే అంశాలపై ఏటీఎస్ దర్యాప్తు చేస్తోందన్నారు. "గుజరాత్ ఏటీఎస్ దర్యాప్తులో ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒక టీమ్ బాంబును తయారు చేయడానికి ప్రయత్నిం చినట్లు తేలింది. అతడి వద్ద జైషే మహమ్మద్ ప్రచార సాహితికి సంబంధించి పుస్తకాలు ఉన్నాయి. దాని సాయం చేసుకొని ఉంది. అంతకుముందు అరెస్ట్ అయిన ఎనిమిది మందిలో ఒకరైన అమీన్ అనే వ్యక్తి, గత అరెస్ట్ అయిన నిందితులకు బాంబు తయారీ సామగ్రి సరఫరా చేశాడు" అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ డంకాని పేర్కొన్నారు.

## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ

మొదటి తరువాయి




2027 నుంచి పూర్తి స్థాయిలో ఈ పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పాలిమర్ నోట్లతో పాటు పేపర్‌తో తయారు చేసిన కరెన్సీ నోట్లు కూడా అందుబాటులో ఉంటా యి. పాత నోట్ల స్థానాన్ని కొత్త నోట్లు భర్తీ చేయవని, రెండూ ఉనికిలో ఉంటాయని ఆర్‌బీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం కాగితంతో తయారవుతున్న సంప్రదాయ కరెన్సీ నోట్ల కన్నా ఈ పాలిమర్ నోట్లు పటిష్టంగా ఉంటాయి.

# కరువుపై కేంద్రానికి లేఖ

మొదటి తరువాయి

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉందని చెప్పారు. తొలి ప్రాధాన్యత తాగునీరు, విద్యుత్‌కు ఇస్తామన్నారు. సాగునీరు, వ్యవసాయం, ఇతర అవసరాల కోసం ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

కమిటీల ఏర్పాటు

కరువు పరిస్థితి అంచనాల కోసం ఉమ్మడి పదిజిల్లాల ప్రాతిపదికగా రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మెన్ జీ చిన్నారెడ్డి నేతృత్వంలో వ్యవసాయ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలతో పాటు పశువుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలతో నివేదిక అందించాలని కోరింది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున, అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం ఆరుతడి పంటలు సాగుచేయండి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని, వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం సూచించింది. దానిలో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

ధరణి అక్రమాలపై 'సిట్' ఏర్పాటు

భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన 2020 అక్టోబర్ 29 నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా అన్ని అనుమానాస్పద లావాదేవీలను 'సిట్' లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం పేర్కొంది. ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని సిట్‌కు దిశానిర్దేశం చేసింది. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పాత్రతో పాటు, పోర్టల్ నిర్వహణ సంస్థ ఎంపిక, టెండర్ ప్రక్రియ, వెండర్‌కు కాంట్రాక్టు కేటాయింపు, పోర్టల్ రూపకల్పన, సిస్టమ్ ఆర్కిటెక్చర్, డేటా భద్రతలో ఉన్న లోపాలపై విచారణ జరపాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

టెండర్ల కోసం యూనిఫైడ్ విధానం

ప్రభుత్వం చేపట్టే ఇంజినీరింగ్ పనుల్లో పరిపాలన అనుమతులతో పోలిస్తే అంచనాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని మంత్రివర్గం ఆందోళన వ్యక్తం చేసింది. అంచనా వ్యయానికి, చేస్తున్న ఖర్చుకు మధ్య పొంతన కుదరటం లేదనీ, ఫలితంగా సకాలంలో పనులు పూర్తి కావట్లేదనీ, మంజూరైన అంచనాలు, సవరించిన అంచనాల వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగిపోతున్నదని అభిప్రాయపడింది. అందుకే పనుల అప్రైజల్ నుంచి ప్రాజెక్టు ప్రపోజల్, భూసేకరణ, టెండర్లు, బిల్లుల చెల్లింపు విధివిధానాలన్నింటికీ ఒక యూనిఫైడ్ విధానాన్ని రూపొం దించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్వర్యంలో వీటన్నింటి సమగ్ర సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుల రూపకల్పన, భూసేకరణ, ల్యాండ్ అసెంబ్లీ, కొనుగోళ్లు, కాంట్రాక్టు నిర్వహణ వరకు అన్ని దశలను పరిశీలించేలా నిర్దిష్ట విధివిధానాలపై ఈ కమిటీ పరిశీలన చేసి, నివేదిక ఇవ్వాలని కోరారు.

## ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

మొదటి తరువాయి

బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మతో కలిసి ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఉద్యోగ జేఏసీ నేతలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ కుటుంబ సభ్యులేననీ, వారి సంక్షేమం, ఆరోగ్య భద్రతను చూడాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. సుమారు ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రయివేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను ఈ పథకం కవర్ చేస్తుందని చెప్పారు. ఈ పథకం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం 'ట్రస్ట్'ను ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఆరోగ్య భద్రత కోసం సకల జనుల సమ్మెతో సహా ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. పదేండ్లపాటు ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసిందన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను తమ ప్రభుత్వం మానవీయ కోణంలో మంజూరు చేస్తోందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచామని అన్నారు. అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు.

## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

**-85% మరణాలు వృద్ధులే**
**- మరింత పెరగనున్న మరణాలు**
**-హెచ్చరిస్తున్న నిపుణులు**

న్యూఢిల్లీ



శీతల ఖండం యూరప్‌లో వేడిగాలులు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. పలు దేశాలు హీట్ డోమ్ వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రచండ వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతు న్నారు. అనేక దేశాలలో ప్రమాదకర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణో గ్రతలు పెరుగుతుండటంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.ఒక్క జూన్‌లో సంభవించిన వేడిగాలులతోనే 9 యూరోపియన్ దేశాలలో కనీసం 12,000 మంది చనిపోయి నట్లు పలు గణాంకాల వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు హీట్ వేవ్‌కు తీవ్రంగా ప్రభావితమ య్యాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మరింత తీవ్ర మవ్వడం తోదాదాపు 85% మంది 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు మృతి చెందారని పలు ఆరోగ్య సంస్థలు వెల్లడించా యి. ఇంకా ఈ మరణాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన వడగాడ్పులు అంతటా విస్తరిస్తుండడంతో యూరప్‌లోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు అనేక దేశాలలో జనజీవనం, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నా యని, వీటిని సరి చేయలేక భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్‌కు చెందిన వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

### ఫీఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా బార్ల సమయం పొడిగింపు

మొదటి తరువాయి

వస్తోంది. పబ్లిక్ ప్లేస్‌లలో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్‌పై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

## నేడే నింగిలోకి విక్రమ్-1

**-ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్**
**-దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి**
**-350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం**

న్యూఢిల్లీ




భారతీయ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ శనివారం చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తన విక్రమ్-1 రాకెట్ మొదటి ఆర్బిటల్ లాంచ్ చేయనున్నది. ఈ మిషన్ 'ఆగమన్'లో పూర్తిగా ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన లాంచ్ వెహికల్ ఉపయోగించి పేలోడ్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు ఈ రాకెట్ శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. "భూమిపై విక్రమ్-1ను పరీక్షించడానికి చేయగలిగినదంతా మేము చేశాం. జూలై 18న, మొదటిసారిగా నిజమైన ఫ్లైట్ వాతావరణంలో విక్రమ్-1 ఎలా పనిచేస్తుందో చూడటానికి మేం ఆసక్తిగా ఉన్నాం" అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పవన్‌కుమార్ చందన చెప్పారు.

విక్రమ్-1 అంటే ఏమిటి?

విక్రమ్-1 అనేది పూర్తిగా నాలుగు దశల ఆర్బిటల్ లాంచ్ వెహికల్. మొదటి మూడు దశలు సాలిడ్ ప్రొపల్షన్‌ను ఉపయోగిస్తాయి. నాలుగో దశ ఆర్బిటల్ ఇన్సర్షన్, ప్రిసిషన్ విన్యాసాల కోసం లిక్విడ్ ఇంజిన్‌ను ఉపయోగిస్తుంది. 350 కిలోల వరకు బరువు ఉన్న చిన్న ఉపగ్రహాలను ఎర్త్ ఆర్బిట్‌కి తీసుకెళ్లడానికి దీనిని నిర్మించారు. దీని మొదటి టెస్ట్ ఫ్లైట్ 60 డిగ్రీల వాలులో 450 కిలోమీటర్ల కక్ష్యను చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. విక్రమ్-1 భారతీయ ఎర్త్ అబ్జర్వేషన్ నానోశాటిలైట్ మేకర్ గ్రహ స్పేస్, తదితర సంస్థల నుంచి బహుళ సాంకేతిక ప్రదర్శన పేలోడ్‌లను తీసుకెళ్లనుంది.

## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

**-22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో**
**- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు**
**- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం**
**- ఇంటెలిజెన్స్ నివేదికలు డీక్లాసిఫై చేసినట్లు వెల్లడి**



న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై సంచలన ఆరోపణలు చేశారు. సుమారు 22 కోట్ల మంది అమెరికన్ ఓటర్ల వ్యక్తిగత సమాచారం చైనా చేతికి చేరిందని, ఆ డేటాను అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి ఉపయోగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన 2020 జనవరి నుంచి 2026 జూన్ వరకు ఉన్న ఇంటెలిజెన్స్ నివేదికలను డీక్లాసిఫై చేసినట్లు ప్రకటిస్తూ ఈ విషయాలను వెల్లడించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఎన్నికల డేటా లీక్ వెనుక చైనా పాత్ర ఉందని ఆరోపించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, రాజకీయ అనుబంధాల వంటి సున్నితమైన వివరాలను సేకరించి ఎన్నికలపై ప్రభావం చూపే ప్రయత్నం చేసిందని విమర్శించారు.

2020 నుంచే డేటా సేకరణ

2020 ఎన్నికల సమయంలోనే చైనా ఈ సమాచారాన్ని సేకరించడం ప్రారంభించిందని, ఇటీవలి వరకు ఆ ప్రక్రియ కొనసాగిందని ట్రంప్ తెలిపారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి సదరు ఓటర్ల సమూహ, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయ భద్రతకు ముప్పు

ఈ వ్యవహారం అమెరికా జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల డేటాను విశ్లేషించి రాజకీయ ప్రయోజనాలకు వినియోగించేందుకు చైనా ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఈ అంశంపై ఉన్న కీలక సమాచారాన్ని కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని కూడా విమర్శించారు. ట్రంప్ ఆరోపణలు అమెరికా-చైనా మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాజీపేట నూతన బస్టాండ్ భూకేటాయింపుపై రైల్వే జీఎం, డీఆర్ఎంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య భేటీ

● కాజీపేట బస్టాండ్ భూకేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీ వినతి

**ఉమ్మడి వరంగల్, జూలై 17 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోనికాజీపేటలో ప్రతిపాదిత నూతన బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులను కోరారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డా. ఆర్. గోపాలకృష్ణన్‌లను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భూ మార్పిడి అంశంపై వారితో ఎంపీ విస్తృతంగా చర్చించారు.

కాజీపేట సిగ్నల్ జంక్షన్ పరిధిలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన రైల్వే భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన విలువ ప్రాతిపదికన మార్పిడి చేయాలని రైల్వే శాఖ 2025 జూన్ 4న ప్రతిపాదించినప్పటికీ, ఏడాదికిపైగా గడిచినా ప్రక్రియ ముందుకు సాగలేదని ఎంపీ డాక్టర్ కడియం కావ్య





వివరించారు. భూ మార్పిడి కోసం వరంగల్--హనుమకొండ ప్రాంతంలో అనువైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. భూ మార్పిడి ప్రక్రియను పూర్తి చేసేందుకు రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి, అవసరమైన చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భూ మార్పిడి ప్రక్రియలో జాప్యం కారణంగా కొత్త బస్టాండ్ నిర్మాణంఆలస్యమవుతోందని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని త్వరితగతిన సంయుక్త స్థల పరిశీలన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాజీపేట కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రి-సిటీ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలుఅందుబాటులోకి వస్తాయని ఎంపీ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్, జాతీయ రహదారులకు సమీపంలో ఆధునిక బస్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, బస్సుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, ప్రజా రవాణా అనుసంధానం మెరుగుదల వంటి ప్రయోజనాలు కలుగుతాయని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించిన స్వచ్ఛంద సేవకుడు భాస్కర్ నాయక్...



**మిడ్జిల్, జూలై 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛంద సేవకుడు మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన జరుపుల భాస్కర్ నాయక్ పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్ చౌహాన్ నాయక్‌లకు పూల బొకేలు అందించి శాలువాలతో సత్కరించారు. ప్రజా సేవలో విశిష్టంగా సేవలందిస్తున్న నాయకులను గౌరవించడం తనకు ఆనందంగా ఉందని భాస్కర్ నాయక్ తెలిపారు. ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు సమాజం నుంచి ప్రోత్సాహం లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు భాస్కర్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అభినందించారు.....





నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
epaper.netidarshini.com
27 Oct 2025 - Page 3

పేరుకు మాత్రమే టూ వీలర్ రోజుకు సుమారు క్వింటాలు బియ్యం అక్రమ రవాణా

మిడ్జిల్, అక్టోబర్ 26, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో): తెలంగాణలో పక్కదారి పడుతున్న సన్నబియ్యం మిడ్జిల్ మండలంలో అక్రమ రవాణ కేజీకి రూ.10 నుండి రూ.15 ఇచ్చి లబ్ధిదారుల నుండి కొనుగోలు చేస్తున్న దళారులు, తెలంగాణలో రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇస్తున్న సన్నబియ్యం భారీగా అక్రమ రవాణాకు గురవుతున్నా కనీసం పట్టించుకోని అధికారులు.... పేరుకు మాత్రమే టూ వీలర్, రోజు అయిదు క్వింటాలు డెలివరీ మిడ్జిల్, వాడియాల, బోయిన్ పల్లి గ్రామాల నుండి కొనుగోలు చేసి,మల్లాపురం, గుడియానిపల్లి ప్రాంతాలలో నిలువ చేసి, అక్కడి నుండి రాత్రి వేళలో కల్వకుర్తి, ఊరుకొండ మిల్లులకు సరఫరా చేసినట్లు సమాచారం, ఇప్పటికైనా అధి కారులు నిద్ర లేచి సన్నబియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు..



గతంలో ప్రచురించిన (ఫైల్‌ఫోటో వార్త )

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

●ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో చిక్కిన వ్యక్తి

**మిడ్జిల్, జూలై 17, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం గుడియాన్ పల్లి గ్రామానికి చెందిన లగిశెట్టి వెంకటేష్, మిడ్జిల్ మండలంలోని కొత్తూరు గ్రామం నుంచి సుమారు క్వింటాల్ నర (దాదాపు 150 కిలోలు) పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్ర వాహనంపై గుడియాన్ పల్లి గ్రామానికి తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మిడ్జిల్ పోలీస్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళు న్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వెంటనే బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు. ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం లేదా తరలించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు

# సెల్ ఫోన్ సేవలను విస్తరించాలి

●ఎంపీ మల్లు రవి ని కోరిన కాంగ్రెస్ నాయకులు



**ఆమనగల్లు,జులై17(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణంతో పాటు, మండల పరిధిలోని అన్ని గ్రామాల కు బిఎస్ఎన్ఎల్ సెల్ఫోన్ సేవలను విస్తరించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. హైదరాబాదులోని ఎంపీ నివాసంలో శుక్రవారం ఎంపీ మల్లురవిని ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, డిసిసి కార్యదర్శి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టిపల్లి సత్యం,రవికుమార్, ఖాదర్ ఖాద్రి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవిని వారు సత్కరించారు. అనంతరం ఆమనగల్ పట్టణంలో బిఎస్ఎన్ఎల్ 5జి సౌకర్యం కల్పించాలని, అలాగే మండలంలోని మాలేపల్లి గ్రామానికి సెల్ టవర్ మంజూరు చేసి సిగ్నల్స్ అందేలా చూడాలని వారు మల్లు రవిని కోరారు. మాలేపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు,నాయకులు ఎంపీ ని అభ్యర్థించారు.

# కాంగ్రెస్ ప్రజల బకాయి చెల్లించాలి

●బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి డిమాండ్

**మిడ్జిల్ జూలై 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** ఎన్నికల్లో ఎన్నికల గ్యారెంటీ తో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇవ్వవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు నెలకు 2వేల5 వందలు,వృద్ధులకు,బీడీ కార్మికుల కు నెలకు 4 వేల పింఛన్లు,దివ్యాంగులకు6వేల పింఛన్లు,కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం,విద్యార్థినులకు స్కూటీలు,ఫీజు రీయింబ ర్స్మెంట్,రైతు కూలీలు,ఉపాధిహామీ కింద సంవత్సరానికి 12వేలు,ఆటో కార్మికులకు సంవత్సరానికి12 వేలు,నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి,విద్యా భరోసా,2లక్షల ఉద్యోగాలు ఇలా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మూడేళ్లుగా వేల కోట్ల బకాయి పది ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పడిన బకాయి చెల్లించి తీరాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

## వరంగల్ సి పి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

● శాంతిభద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారం పై సీపీతో చర్చించిన ఎంపీ, ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, జూలై 17 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవల అందుబాటు, అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు సంబంధించి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు భరోసా కల్పించేందుకు కృషి చేయాలనిఅభిప్రాయపడ్డారు.

# వర్షం ప్రతి నీటి చుక్కను పొదుపు చేద్దాం

● మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్



**ఆమనగల్లు,జులై17(నేటి దర్శిని);** వర్షం ప్రతి నీటి చుక్కను పొదుపు చేద్దామని మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ అన్నారు. “వర్షపు నీటిని పొదుపు చేద్దాం...భవిష్యత్తుని కాపాడుదాం”కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్యా నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్య కార్యక్రమంలో భాగంగా నల్ల ట్యాప్ బిగించి, పొదుపుగా నీటిని వాడాలని, వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటూ భూగర్భ జలాన్ని పెంచాలని భావితరాలకు ఇచ్చే సూచనలను మార్గదర్శకం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. గతంలో ఐసిఐసిఐ బ్యాంకు సహకారంతో నిర్మించిన భూగర్భ జల సౌరక్షణ కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మండల విద్యాధికారి పాండు,మున్సిపాలిటీ మేనేజర్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి,కౌన్సిలర్ యంగలి భాగ్యలక్ష్మి రఘు, విద్యార్థినీ,విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పర్యావరణ విధ్వంస ఫలితమే విఫల రుతుపవనాలు



అధిక రుతుపవన వర్షపాతం వినాశకరమైన వరదలకు, మౌలిక సదుపాయాల నష్టానికి కారణమవుతుంది, అదే సమయంలో వర్షపాతం చాలా తక్కువగా ఉంటే కరువులు, పంట నష్టాలు, నీటి కొరతకు దారితీస్తుంది. అదే సమయంలో, రాబోయే దశాబ్దాలలో రుతుపవన గాలులు, వర్షపాతం ఎలా మారతాయనే అంచనాపై రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, పట్టణ మురుగునీటి వ్యవస్థల రూపకల్పన కూడా ఎక్కువగా ఆధారపడి ఉండాలి. ఎందుకంటే, ఈ నిర్మాణాలు కేవలం కొన్ని సంవత్సరాల కోసం కాకుండా, అనేక దశాబ్దాల పాటు నిలిచి ఉండేలా ఉండాలి. అందువల్ల, వేడెక్కుతున్న వాతావరణంలో రుతుపవనాలు ఎలా పరిణామం చెందుతాయో అర్థం చేసుకోవడం, వాతావరణ మార్పులను తట్టుకోగల భవిష్యత్తును ప్రణాళిక చేయడానికి అత్యవసరం. రుతుపవనాలు భారతదేశ వాతావరణ వైరుధ్యాన్ని మరోసారి బయటపెడుతున్నాయి. బలహీనమైన రుతుపవనాలు కరువు, తక్కువ పంట దిగుబడి, పెరుగుతున్న ఆహార ధరలు, గ్రామీణ ఆదాయాలు తగ్గిపోతాయనే భయాలను కలిగిస్తున్నాయి. రైతులు విత్తనాలు వేయడాన్ని ఆలస్యం చేస్తారు. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. కానీ చివరకు వర్షాలు వచ్చినప్పుడు, అవి తరచుగా స్వల్పకాలికంగా, తీవ్రమైన జల్లులుగా కురుస్తాయి, దీనివల్ల వరదలు, కొండచరియలు విరిగిపడటం, మౌలిక సదుపాయాల వైఫల్యాలు సంభవిస్తాయి. ఉపశమనం కలిగించడానికి బదులుగా, రుతుపవనాలు అంతకంతకూ విధ్వంసాన్నే తెస్తున్నాయి. కేరళలోని అనక్కంపొయిల్-కల్లాడి-మెప్పాడి సొరంగం ప్రదేశంలో ఇటీవల జరిగిన కొండచరియల విపత్తు ఈ రెండవ సవాలును స్పష్టం చేస్తుంది. భారీ వర్షపాతం ఈ విపత్తుకు కారణమై ఉండవచ్చు. కానీ పదేపదే ఇచ్చిన భద్రతా హెచ్చరికలను విస్మరించారా? తవ్వకాల శిథిలాలను సరిగ్గా నిర్వహించారా? పర్యవేక్షణకు బాధ్యత వహించే వివిధ ఏజెన్సీలు తమ విధులను నిర్వర్తించాయా? అనే దానిపై ప్రశ్నలు మిగిలి ఉన్నాయి.దాదాపు అదే సమయంలో, ఒక రోడ్డు కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడటం పుణె ముంబై జాతీయ రహదారికి అంతరాయం కలిగించి, భారీ ట్రాఫిక్ రద్దీకి కారణమయ్యాయి. ఇది తీవ్రమైన వాతావరణ పరిస్థితులవల్ల కీలకమైన రవాణా మౌలిక సదుపాయాలు ఎంతగా దెబ్బతింటాయో బహిర్గతం చేసింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముూడకశ్మీర్‌లలో జరిగిన ఇలాంటి విపత్తులు సర్వసాధారణమే. అందులకే ఇటువంటి పకృతి వైపరీత్య సమస్యలు అరుదైన సమస్యలు కావని, పేలవమైన ప్రణాళిక, సున్నితమైన పర్యావరణ వ్యవస్థలలో అడ్డూ అదుపులేని నిర్మాణాలు, భద్రత, పర్యావరణ నిబంధనల బలహీనమైన అమలు వంటి వాటి వల్ల మరింత తీవ్రమయ్యే వాతావరణ మార్పుల వల్ల సంభవించే విపత్తుల ఒక పెద్ద నమూనాలో భాగమని స్పష్టం అవుతుంది. ఈ విపత్తుల వల్ల కలిగే ఆర్థిక నష్టం కేవలం తక్షణ ప్రాణ, ఆస్తి నష్టానికి మించి ఉంటుంది.రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతింటాయి. పర్యాటక రంగానికి అంతరాయం కలుగుతుంది, వ్యాపారాలు మూతపడతాయి. ప్రభుత్వాలు సహాయక, పునర్నిర్మాణ పనుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తాయి. అదే సమయంలో, బలహీనమైన రుతుపవనాల వల్ల ద్రవ్యోల్బణం పెరిగి, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది. అందువల్ల భారతదేశం రెండుసార్లు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. మొదట తక్కువ వర్షపాతం వల్ల, ఆ తర్వాత తప్పుడు ప్రదేశాలలో, తప్పుడు సమయంలో కురిసిన అధిక వర్షాల వల్ల. ఇటువంటి వైపరీత్యాలు సంభవించినప్పుడు విపత్తు నివారణ చర్యలకు పాల్పడే ప్రభుత్వం, ముందు జాగ్రత్తల విషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు భావించాల్సి వస్తుంది. ప్రభుత్వ స్పందన చాలావరకు ప్రతిచర్యాత్మకంగానే ఉంది. విపత్తు హెచ్చరికలు, పర్యావరణ నిబంధనలు, భద్రతా మార్గదర్శకాలు తరచుగా కాగితాలకే పరిమితమవుతున్నాయి. కానీ వాటి అమలు, జవాబుదారీతనం బలహీనంగానే ఉంటున్నాయి.పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలలో తగిన భద్రతా చర్యలు లేకుండా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కొనసాగుతుండగా, విపత్తు అనంతర సహాయంతో పోలిస్తే వాతావరణ మార్పులకు అనుగుణంగా మారడంపై చాలా తక్కువ శ్రద్ధ చూపుతున్నారు. వాతావరణ మార్పుల వల్ల వాతావరణం మరింత అనూహ్యంగా మారుతున్నందున, భారతదేశానికి పటిష్టమైన పర్యావరణ పాలన, శాస్త్రీయ ప్రణాళిక, కఠినమైన జవాబుదారీతనం అవసరం. ప్రభుత్వ అభివృద్ధి అజెండాలో వీటికి తగు ప్రాధాన్యత కల్పించాలి. లేని పక్షంలో, బలహీనమైన రుతుపవనాలు, తీవ్రమైన వర్షపాతం రెండూ ప్రజల జీవితాలను, జీవనోపాధులను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం కొనసాగుతుందని గ్రహించాలి. భారత వేసవి రుతుపవనాలు ఉపఖండంలోని సామాజిక -ఆర్థిక జీవనానికి వెన్నెముక వంటివి. ఇది వ్యవసాయం, నీటి వనరులు, ఇంధన ఉత్పత్తి, దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది.అధిక రుతుపవన వర్షపాతం వినాశకరమైన వరదలకు, మౌలిక సదుపాయాల నష్టానికి కారణమవుతుంది, అదే సమయంలో వర్షపాతం చాలా తక్కువగా ఉంటే కరువులు, పంట నష్టాలు, నీటి కొరతకు దారితీస్తుంది. అదే సమయంలో, రాబోయే దశాబ్దాలలో రుతుపవన గాలులు, వర్షపాతం ఎలా మారతాయనే అంచనాపై రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, పట్టణ మురుగునీటి వ్యవస్థల రూపకల్పన కూడా ఎక్కువగా ఆధారపడి ఉండాలి. ఎందుకంటే, ఈ నిర్మాణాలు కేవలం కొన్ని సంవత్సరాల కోసం కాకుండా, అనేక దశాబ్దాల పాటు నిలిచి ఉండేలా ఉండాలి. అందువల్ల, వేడెక్కుతున్న వాతావరణంలో రుతుపవనాలు ఎలా పరిణామం చెందుతాయో అర్థం చేసుకోవడం, వాతావరణ మార్పులను తట్టుకోగల భవిష్యత్తును ప్రణాళిక చేయడానికి అత్యవసరం. అందుకోసమే, వాతావరణ శాస్త్రవేత్తలు తరచుగా కపుల్ మోడల్ ఇంటర్‌కంపారిజన్ ప్రాజెక్ట్ (సిఎంఐపి) కింద అభివృద్ధి చేసిన ప్రపంచ వాతావరణ నమూనాలపై ఆధారపడతారు. ఈ నమూనాలు వాతావరణం, సముద్రం, భూమిని కలిపి అనుకరిస్తాయి, తద్వారా అవి నిరంతరం అవసరమైన చర్యలు తీసుకునే వీలు కల్పిస్తాయి. ఉదాహరణకు, సముద్రంపై బలమైన గాలులు మిశ్రమాన్ని పెంచి, సముద్ర ఉపరితలాన్ని చల్లబరుస్తాయి. దీనికి ప్రతిగా, చల్లబడిన సముద్రం గాలులను సవరిస్తుంది. ఇది వాతావరణం, శీతోష్ణస్థితిని రూపొందించే ఒక ఫీడ్‌బ్యాక్‌ను సృష్టిస్తుంది. రుతుపవనాలను వాస్తవికంగా అనుకరించడానికి ఇటువంటి పరస్పర చర్యలు చాలా అవసరం. అయినప్పటికీ ఈ నమూనాలు పరిపూర్ణమైనవి కావు. సముద్రం, వాతావరణం లేదా భూమిని సూచించడంలో తప్పులు శీతోష్ణస్థితి వ్యవస్థ అంతటా వ్యాపించి, అనుకరించే రుతుపవనాలను ప్రభావితం చేయగలవు.

# గత ఆరు నెలల్లో..
# 554 మంది భర్తల హత్యలు, ఆత్మహత్యలు



**న్యూఢిల్లీ జూలై 17 (నేటి దర్శిని)**
గత ఆరు నెలల్లో సుమారు 554 మంది భర్తలు హత్యకు గురికావడంతో పాటు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశంలో ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురికాగా, ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. గురుగ్రామ్‌కు చెందిన 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' దీనికి సంబంధించి ఒక నివేదిక విడుదల చేసింది. 2026 జనవరి నుంచి జూలై 14 వరకు మీడియాలో వచ్చిన వార్తలు, ఆ సంస్థ సేకరించిన వివరాల ఆధారంగా ఒక రిపోర్ట్‌ను తయారు చేసింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా భర్తల హత్యలు, ఆత్మహత్యలకు సంబంధించిన 554 సంఘటనలను తాము నమోదు చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. వివాహేతర సంబంధాలు, వైవాహిక వివాదాలు ప్రధాన కారణమని పేర్కొంది.కాగా, ఈ నివేదిక ప్రకారం భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో భర్తలు హత్యకు గురైన 322 సంఘటనలు జరిగాయి. అలాగే వైవాహిక వివాదాలు, గృహ హింస, వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, ఇతర సమస్యల కారణంగా భర్తలు ఆత్మహత్య చేసుకున్న 232 ఘటనలను ఆ సంస్థ నమోదు చేసింది. 2026 మొదటి ఆరు నెలల్లో భారతదేశంలో ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురయ్యారని, ఒకరి కంటే ఎక్కువ మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయని ఆ ఫౌండేషన్ తెలిపింది. అయితే ఈ కేసుల సంఖ్యలు కేవలం మీడియా నివేదికల ఆధారంగా తాము సేకరించినవేనని, అధికారిక ప్రభుత్వ గణాంకాలు కాదని ఆ సంస్థ స్పష్టం చేసింది. అనేక సంఘటనలు మీడియా దృష్టికి రాలేదని, అలాగే భర్తల హత్యలు లేదా గృహ హింసకు గురైన పురుషుల వివరాలను నమోదు చేసే అధికారిక జాతీయ డేటాబేస్ ఏదీ లేకపోవడంతో వాస్తవ సంఘటనల సంఖ్య దీనికంటే చాలా ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. మరోవైపు భర్తల హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధాలేనని ఈ నివేదిక గుర్తించింది. నమోదు చేసిన 322 హత్య కేసుల్లో 194 (సుమారు 60.2 శాతం) ఘటనలకు ఇదే కారణమని తేలింది. వివాహేతర సంబంధాన్ని భర్తలు వ్యతిరేకించినప్పుడు లేదా అడ్డుకున్నందుకు భార్యలు తమ ప్రియులతో కలిసి భర్తలను చంపడానికి కుట్ర పన్నిన ఆరోపణలు అనేక కేసుల్లో ఉన్నాయని ఆ ఫౌండేషన్ తెలిపింది.కాగా, భర్తలు చేసుకున్న 232 ఆత్మహత్యలను కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. వీటిలో 104 కేసులు (44.83 శాతం) దీర్ఘకాలిక గృహ వివాదాలే ప్రధాన కారణమని గుర్తించింది. మరో 57 కేసులు (24.57 శాతం) భార్యలు లేదా అత్తమామల వేధింపుల ఆరోపణలు కారమని ఆరోపించింది. 29 కేసులు (12.5 శాతం) వివాహేతర సంబంధాలతో ముడిపడి ఉన్నట్లు పేర్కొంది. తప్పుడు క్రిమినల్ ఆరోపణలు, ప్రియురాళు లేదా వారి కుటుంబాల వేధింపులు, ఇతర అంశాలు వంటివి మిగిలిన కేసులని వివరించింది. అయితే ఈ నివేదిక ప్రకారం గత ఆరు నెలల్లో ఉత్తర ప్రదేశ్‌లో అత్యధికంగా 93 మంది భర్తల హత్యలు, 103 మంది భర్తల ఆత్మహత్యలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలు కూడా అధిక సంఖ్యలో నమోదైన కేసుల జాబితాలో ఉన్నాయి. ఈ సంవత్సరం నమోదైన అత్యంత దారుణమైన 25 కేసులను ఫౌండేషన్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. వీటిలో భర్తల తల నరకడం, శరీరాన్ని ముక్కలుగా నరకడం, విషప్రయోగం, ఇంటి నేల కింద పాతిపెట్టడం, సజీవంగా దహనం చేయడం, లోతైన లోయల్లోకి తోసేయడం, భార్యలు లేదా వారి ప్రియుల కుట్రలతో హత్యలు చేయడం వంటి ఘటనలు ఉన్నాయని తెలిపింది.ఇక భర్తల ఆత్మహత్య కేసులలో అనేక మంది బాధితులు వివరణాత్మక సూసైడ్ నోట్లు లేదా వీడియోలు రికార్డ్ చేశారని ఈ నివేదిక పేర్కొంది. దీర్ఘకాలిక వేధింపులు, గృహ హింస, తప్పుడు క్రిమినల్ కేసులు, తమ పిల్లలను కలుసుకోనివ్వకపోవడం లేదా నిరంతర మానసిక క్రూరత్వం వంటి కారణాల వల్ల భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వివరించింది. కాగా, దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కేతన్ అగర్వాల్ హత్య కేసును 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' వ్యవస్థాపకురాలు దీపికా నారాయణ్ భరద్వాజ్ ప్రధానంగా ప్రస్తావించారు. అతడి కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ కలసి లోయలోకి తోసి హత్య చేయడం వంటి దారుణాలు దేశంలో ప్రతిరోజూ నమోదవుతున్నాయని తెలిపారు. అయితే భర్తల హత్యలు, గృహ హింసకు గురైన పురుష బాధితుల కోసం అధికారిక నేర గణాంకాలలో ప్రత్యేక వర్గీకరణ లేకపోవడం వల్ల ఈ సమస్య వాస్తవ తీవ్రతను అంచనా వేయడం కష్టమవుతోందని ఆమె అన్నారు.

# ఓటర్ జాబితాలో పేరు లేకుంటే
# పౌరసత్వం కోల్పోయినట్టు కాదు..


## -సుప్రీంకోర్టు పునరుద్ఘాటన



**న్యూఢిల్లీ జూలై 17 (నేటి దర్శిని)**
ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) తర్వాత ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని సుప్రీంకోర్టు శుక్రవారం మౌఖికంగా పునరుద్ఘాటించింది. పౌరసత్వాన్ని నిర్ణయించే అంతిమ అధికారం భారత ఎన్నికల సంఘానికి లేదని, అలాగే ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని బీహార్ సర్ తీర్పులో తాము స్పష్టం చేశామని సుప్రీంకోర్టు పేర్కొంది. సర్ తర్వాత ఓటర్ల జాబితాలో పేర్లు లేని వ్యక్తుల అప్పీళ్లను విచారించే అప్పిలేట్ ట్రిబ్యునళ్లలో విచారణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. 19 అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఎదుట(వీటి నుంచి ఇద్దరు న్యాయమూర్తులు రాజీనామా చేశారు) 34 లక్షల అప్పీళ్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టుకు తెలిపారు.ఇప్పటి వరకు సుమారు 38,000 అప్పీళ్లపై మాత్రమే నిర్ణయం తీసుకున్నారని, వాటిలో కనీసం 70 శాతం అప్పీళ్లపై సానుకూలంగా తీర్పు వచ్చిందని ఆయన చెప్పారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగానే ఓటర్ల జాబితా నుండి పేర్లు కోల్పోయిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్), అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిందని సీనియర్ న్యాయవాది పేర్కొన్నారు. అంతేగాకుండా అటువంటి వ్యక్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను కూడా నిరాకరిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చీ మాట్లాడుతూ బీహార్ సర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, పౌరసత్వాన్ని నిర్ణయించే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీఐకి లేదని పేర్కొన్నారు. పౌరసత్వంపై సందేహాల కారణంగా ఒక వ్యక్తి పేరును ఓటర్ల జాబితా నుండి తొలగించినపుడు ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను నిర్ధారించాలని కోరుతూ కేంద్రానికి దరఖాస్తు చేయాల్సిన బాధ్యత ఈసీఐపై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దీనికి సీనియర్ న్యాయవాది స్పందిస్తూ ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన వారికి సర్ ప్రక్రియ తర్వాత ప్రభుత్వం ఇతర ప్రయోజనాలను కూడా నిరాకరిస్తుందని ఎవరూ ఊహించలేదని చెప్పారు. ఆ విషయం న్యాయమూర్తుల దృష్టికి వచ్చిందని తాను భావించడం లేదని, ఎందుకంటే అలా జరిగి ఉంటే ఈ అంశంపై విచారణ జరుగుతున్నంత కాలం పౌరులకు లభించే ఇతర పౌర హక్కులకు భంగం కలిగించవద్దని ఒక వాక్యాన్ని తీర్పులో జోడించి ఉండేవారని ఆయన పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ మా తీర్పు స్పష్టంగా ఉంది. ఆర్టికల్ 9,10,11,12 పరిధిలో పౌరసత్వ హోదా విషయంలో ఈసీఐ ఒక రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగిన సంస్థ కాదు. ఓటర్ల జాబితాలపై ఈసీఐకి నియంత్రణ ఉంటుంది. ఒక వ్యక్తిని అందులో చేర్చకూడదని అది నిర్ణయించవచ్చు. అయితే అలా చేయడం వల్ల ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను కోల్పోరు. అందుకే, దీనికి సంబంధించి తగిన బాధ్యతను మేము నిర్దేశించాము అని స్పష్టం చేశారు.

# అంతరిక్షంలో చక్కెర..
# పాలపుంత కేంద్రంలో గుర్తింపు

### భూమిపై పడ్డ 50 మిలియన్ టన్నులు..
### జీవానికి అదే ఆరంభం



**న్యూఢిల్లీ జూలై 17 (నేటి దర్శిని)**
పాలపుంత కేంద్రంలో శాస్త్రవేత్తలు చక్కెర అణువులను కనుగొన్నారు. అంతరిక్షంలోని వాయుమేఘాలు భూమిపై జీవం వికసించడానికి అవసరమైన ఒక ముఖ్యమైన పదార్థాన్ని మోసుకొచ్చి ఉండవచ్చని ఇది సూచిస్తున్నది. అంతరిక్షంలో కనుగొనబడిన మొట్టమొదటి నిజమైన చక్కెర 'ఎరిథ్రూలోస్' గెలాక్సీ కేంద్రంలో లభ్యమైంది. స్పానిష్ ఆస్ట్రోబయాలజీ సెంటర్‌కు చెందిన కాస్మోకెమిస్ట్ ఇజాస్కున్ జిమెనెజ్ సెర్రా నేతృత్వంలోని పరిశోధకుల బృందం, అంతరిక్షంలోని ఈ ఎరిథ్రూలోస్ మన గ్రహంపై ప్రారంభ జీవక్రియ, పునరుత్పత్తి ప్రక్రియలకు అవసరమైన చక్కెర నిల్వలను అందించడంలో సహాయపడి ఉండవచ్చని విశ్వసిస్తున్నది. సుమారు నాలుగు బిలియన్ సంవత్సరాల క్రితం మన సౌరవ్యవస్థ ఇంకా ఏర్పడుతున్న సమయంలో ఇది జరిగింది. అంతరిక్షం నుంచి దాదాపు 50 మిలియన్ టన్నుల చక్కెర భూమిపై పడింది. ఇది జీవానికి అవసరమైన ప్రాథమిక భాగాలను అందించింది. చక్కెరలు అనేవి కణాలకు శక్తినిచ్చే అణువులు, పెద్ద జీవ అణువులను నిర్మించడానికి అవసరమైన ముడి పదార్థాలు. ఇవి ఆర్‌ఎన్‌ఏ, డీఎన్‌ఏల నిర్మాణానికి వెన్నెముకలాంటివి. ఈ అంతరిక్ష మేఘాలు విశ్వంలోని ఇతర భాగాల్లో కూడా ఇదేవిధంగా జీవానికి బీజం వేసి ఉండవచ్చని ఈ అధ్యయనం సూచిస్తున్నది. దాదాపు 300 మిలియన్ సంవత్సరాలపాటు సౌరవ్యవస్థలోని ప్రతి గ్రహం గ్రహశకలాలు, ఉల్కల దాడికి గురైంది. మన చంద్రుడు ఏర్పడింది కూడా ఇలానే. ఇదే సమయంలో అంతరిక్ష ధూళి భూమికి చక్కెరను తీసుకువచ్చింది. జీవానికి పూర్వపు అణువులు ఉన్నట్టు గుర్తించిన 'జి0.693' అనే మేఘాన్ని స్పెయిన్‌లోని రెండు రేడియో టెలిస్కోప్‌లు పరిశీలించాయి. ఈ బృందం మూడు కార్బన్ పరమాణువులు కలిగిన సాధారణ చక్కెరను కనుగొనవచ్చని ఆశించింది. అయితే వారు నాలుగు కార్బన్లు కలిగిన ఎరిథ్రూలోస్‌ను కనుగొని ఆశ్చర్యపోయారు. ఇది మూడు కార్బన్ల చక్కెర కంటే కనీసం 8 నుంచి 17 రెట్లు ఎక్కువగా ఉన్నది. గెలాక్సీ కేంద్రంలో ఇంత భారీ మొత్తంలో చక్కెర ఉండటం అంటే భూమికి కూడా దాని ప్రారంభ సంవత్సరాల్లో ఇది చాలా ఎక్కువ మొత్తంలో అందిందని అర్థం.

**భూమిపై ఎంత పడింది?**
మాలిక్యులర్ క్లౌడ్‌లో కొలిచిన ఎరిథ్రూలోస్ పరిమాణాన్ని బట్టి భారీ ఉల్కల దాడి జరిగిన కాలంలో 0.5 నుంచి 50 మిలియన్ టన్నుల చక్కెర భూమి ఉపరితలానికి చేరుకుని ఉండవచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. అంతరిక్షంలో చక్కెర ఎలా ఏర్పడుతుందో అర్థం చేసుకోవడానికి వారు ఈ డాటాను ఉపయోగించారు. రెండు కార్బన్ల అణువులైన గ్లైకోలాల్డిహైడ్, ఇథిలీన్ గ్లైకాల్‌ను మోసుకెళ్లే చిన్న ధూళికణాల మంచు ఉపరితలంపై ఇది ఏర్పడిందని విశ్లేషణలో తేలింది. రేడియేషన్ ద్వారా ఇవి ఉత్తేజితమైనప్పుడు, అవి కలిసి ఎరిథ్రూలోస్‌ను నిర్మించగలవు. అంతరిక్ష పరిస్థితుల్లో కూడా సంక్లిష్ట అణువులు ఏర్పడగలవని ఈ ఆవిష్కరణ చూపిస్తున్నది."ఎరిథ్రూలోస్‌ను గుర్తించడం చాలా ఉత్తేజాన్ని ఇస్తున్నదని, ఎందుకంటే ఇది ఆర్‌ఎన్‌ఏలో భాగమైన రైబోస్ వంటి చక్కెరలను, జీవక్రియల పుట్టుకకు ముఖ్యమైన ఇతర అణువులను అంతరిక్షంలో కనుగొనే అవకాశాన్ని తెరుస్తుంది" అని సహ రచయిత కార్లోస్ బ్రియోన్స్ అన్నారు. ఈ చక్కెరలు విడిపోయినప్పుడు విశ్వంలో మరెక్కడైనా ల్యాండ్ అయి ఉండవచ్చని వారు నిర్ధారించారు.

# మిడ్జిల్ కేజీబీవీలో హాస్టల్ భద్రతలో అలసత్వం..

● జిల్లా డీఈఓ ఆగ్రహం



**మిడ్జిల్, జులై 17, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థిని హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఘటనపై జిల్లా విద్యాధికారి విజయకుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలను సందర్శించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థిని బయటకు వెళ్లే పరిస్థితి ఎలా ఏర్పడిందని ఉపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బందిని ప్రశ్నిస్తూ భద్రతా లోపాలపై ఆరా తీశారు.బాలికల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేసిన డీఈఓ, ప్రస్తుతం ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకపోవడం అదృష్టమని అన్నారు. ఏదైనా అపశృతి జరిగి ఉంటే సంబంధిత సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే పరిస్థితి వచ్చేదని హెచ్చరించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పాఠశాలలో ఖాళీగా ఉన్న వంట మహిళలు, డే వాచ్‌మెన్ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని ఎంఈఓ సరస్వతి, ఎమ్మార్వో రాఘవేందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం హాస్టల్ నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థినుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. బాలికల హాస్టల్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఇకపై భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తప్పవని డీఈఓ విజయకుమారి స్పష్టం చేశారు.

# విద్యార్థినికి పాపిశెట్టి రాము ఆర్థిక సహాయం అందజేత



**ఆమనగల్లు, జులై 17(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణానికి చెందిన నాగోజు శివాని, సురేందర్ చారి కుమార్తె హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ (ఎంపిహెచ్) కోర్సులో సీటు సాధించింది. విద్యార్థిని ఆర్థిక పరిస్థితి బాగా లేనందున విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్పెంటర్ గా పనిచేస్తున్న సురేందర్ చారి కుటుంబానికి ఉన్నత విద్యాభ్యాసంలో అండగా నిలుస్తూ,ఈ సహాయాన్ని అందించిన పాపిశెట్టి రాముని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలతో అభినందించారు.ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు చేయూత అందించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి రాము మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీలో సర్ ప్రక్రియ 66% పూర్తి

● మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి




**ఆమనగల్లు,జులై17(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) శుక్రవారం వరకు 66% పూర్తయినట్లు ఆమనగల్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా "నేటి దర్శిని"తో మాట్లాడుతూ మున్సిపాలిటీ లో 16,967 ఓటర్లకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.బిఎల్ఓ లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా విధులు నిర్వహిస్తున్నారని, సర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని, ఓటర్లు కూడా తమకు పూర్తి సహకారం అందిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.



# దిల్సుక్ నగర్ లో ఘనంగా మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

● 32వ శాఖను ప్రారంభించిన సినీ నటి మీనాక్షి చౌదరి

**దిల్సుక్ నగర్,జూలై17 (నేటి దర్శిని):** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో దిలసుఖ్ నగర్ లో 32 వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ,

దిలసుఖ్ నగర్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ:

-"ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం" అని తెలిపారు.

-'మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు.

మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో దిలసుఖ్ నగర్ ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది.


ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

# వర్షానికి జలమయంగా మారిన వరంగల్ నగరం

● రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో అవస్థలు పడ్డ వాహనదారులు

● చెరువులు తలపించిన పలు కాలనీలు






**ఉమ్మడి వరంగల్, జూలై 17 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో శుక్రవారం భారీ వర్షం రావడంతో నగరంలోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. వర్షపు నీటిలో రోడ్లపై ఉన్న గుంతలు కనిపించకుండా పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు ప్రారంభమయ్యేలోపు రహదారులపై గుంటలను పూడ్చి నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని సూచిస్తున్నారు .నగరంలోని అంబేద్కర్ భవన్, భీమవరం రోడ్డు ,కాజీపేట తదిత ప్రాంతంలో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై నీరు ప్రవహించడంతో రహదారులు చెరువులను తలపించాయి .సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, వర్షపు నీటిపారుదల సక్రమంగా లేకపోవడం కారణమని నగరవాసులు మండిపడుతున్నారు. కరీంనగర్ ,హనుమకొండ జాతీయ రహదారిపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం పడిన ప్రతిసారి సమస్య ఎదురవుతోందని, అధికారులు శాశ్విత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. వరంగల్ జిల్లాలో రెండు గంటలు కురిసిన భారీ వర్షంతో హనుమకొండలో 57 కాజీపేటలో 53 గీసుకొండ ,ఉర్సు గుట్టలో 50 శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

# కొత్తపేట బిజెపి కార్యాలయంలో ఆషాడ మాస గోరింటాకు సంబరాలు

**కొత్తపేట, జూలై17 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ కౌన్సిల్ మెంబర్ కాటా విజయ గౌడ్ ఆధ్వర్యంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు సంబరాల కార్యక్రమం అత్యంత వైభవంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మరియు వైష్ణవి ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు. ఈ సందర్భంగా వారు మహిళలందరికీ ఆషాడ మాస శు భాకాంక్షలు తెలియజేస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో



మహిళలందరూ భక్తిశ్రద్ధలతో గౌరీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.సంప్రదాయ ఆటలు, పాటలతో కార్యక్రమం సందడిగా సాగి, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆషాడ మాస విశిష్టతను ప్రతిబింబించారు. అనంతరం అందరూ కలిసి ఆత్మీయ వాతావరణంలో భోజనాలు చేసి, పరస్పర ఆప్యాయతలను పంచుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నూకల పద్మ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి మరిపి ప్రసన్న, రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షులు నందికొండ గీతారెడ్డి, కవిత రెడ్డి, డాక్టర్ స్వప్న, స్వర్ణ, యశోద, మరియు కొత్తపేట డివిజన్ మహిళా సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు

- సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.. ఎంపీడీఓకు మాజీ సర్పంచ్ ఫిర్యాదు

**మిడ్జిల్, జులై 17, (నేటి దర్శిని ప్రతినిధి):** మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం సింగందొడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రీతి విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మణ్ రాథోడ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కార్యాలయానికి సమయానికి హాజరుకాకుండా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, పంచాయతీ పరిపాలనను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రామసభలను ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా




నిర్వహించడం వల్ల గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కోల్పోతున్నారని పేర్కొన్నారు.ప్రత్యేక అధికారుల పాలనలో చేపడుతున్న అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని, కొన్ని పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, ఇతర పంచాయతీ సేవలు కూడా సకాలంలో అందడం లేదని, కార్యదర్శి నిర్లక్ష్యంతో గ్రామాభివృద్ధి దెబ్బతింటోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు తేలితే కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

## పాఠశాలలో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ఉమ్మడి వరంగల్, జులై 17 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట 63వ డివిజన్ పరిధిలో ప్రభుత్వ బాల బాలికల పాఠశాలలో మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్ తన సతీమణి కనకతార వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ తాగునీటి ప్లాంట్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇస్తూ, సంబంధిత అధికారులు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపైఉపాధ్యాయులతో చర్చించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడులో అనుమతి లేని రెండు ప్రైవేట్ ల్యాబ్‌లు సీజ్..

- రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ లేకుండానే కొనసాగుతున్న సేవలు
- తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవన్న డీఎంహెచ్‌వో






**గుర్రంపోడు, జూలై 17 (నేటి దర్శిని):** జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న రెండు ప్రైవేట్ ల్యాబ్‌లపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. రాహుల్ ఆదేశాల మేరకు శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గణేష్ ల్యాబ్, బాలాజీ ల్యాబ్‌లలో పలు ఉల్లంఘనలు గుర్తించి సీజ్ చేశారు. తనిఖీల సందర్భంగా ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్ గడువు ముగిసినా పునరుద్ధరించకుండా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా, ల్యాబ్ పరీక్షల్లో గడువు ముగిసిన రియాజెంట్లను వినియోగించడం, నిర్దేశిత భద్రతా, నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం, రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం వంటి తీవ్రమైన లోపాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో రెండు ల్యాబ్‌ల కార్యకలాపాలను తక్షణమే నిలిపివేస్తూ సీజ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. రాహుల్ మాట్లాడుతూ, జిల్లాలో అనుమతి లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలను నిర్వహిస్తే తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువు ముగిసిన రిజిస్ట్రేషన్లను వెంటనే పునరుద్ధరించుకోవాలని, కొత్తగా ప్రారంభించే వైద్య సంస్థలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె. నాగేష్, ఆరోగ్య విద్య విస్తరణాధికారి ఎ. అంజయ్య గౌడ్, సీసీ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలమోని యాదయ్య, కేతమ్మ పుణ్యతిథి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం





**ఎల్.బి.నగర్, జూలై 17 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పోలమోని యాదయ్య, కేతమ్మ పుణ్యతిథి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు ప్రేమాభిమానాలతో, గౌరవప్రదంగా మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. వృద్ధులు ఆనందంగా మహా ప్రసాదాన్ని స్వీకరించి, కార్యక్రమాన్ని నిర్వహించిన సమితి సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, "మనుషులకు చేసే సేవే భగవంతునికి చేసే నిజమైన సేవ. పోలమోని యాదయ్య, కేతమ్మ ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము" అని పేర్కొన్నారు. పుణ్యతిథి సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం వృద్ధులకు ఆత్మీయతను పంచడంతో పాటు, సమాజంలో సేవాభావాన్ని చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మల్కాజిగిరిలో అక్రమ నిర్మాణాల రాజ్యం..

- రహదారుల ఆక్రమణలు, అదనపు అంతస్తులతో నిబంధనలకు తూట్లు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..
- టౌన్ ప్లానింగ్ అధికారులపై విమర్శల వెల్లువ
- ఏసీపీ బాల శ్రీనివాస్ పాత్రపై ఆరోపణలు.. నిష్పాక్షిక విచారణకు ప్రజల డిమాండ్






**మల్కాజిగిరి, జూలై17(నేటి దర్శిని):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ నిబంధనలను బేఖాతరు చేస్తూ రహదారులను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నా, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, పెనాల్టీలు, ఇతర ఆదాయాలు భారీగా కోల్పోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాస అవసరాల కోసం మంజూరైన భవనాల్లో వాణిజ్య దుకాణాలను నిర్మించడం, అనుమతులు లేకుండానే అదనపు అంతస్తులు వేయడం, సెట్‌బ్యాక్‌లు పూర్తిగా ఉల్లంఘించడం వంటి ఘటనలు సర్కిల్ పరిధిలో సాధారణంగా మారిపోయాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారులపై సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాల శ్రీనివాస్‌పై కూడా స్థానికుల నుంచి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు లేకపోవడం, కొంతమంది బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ అంతస్తుల నిర్మాణాలకు మామూళ్లు తీసుకుని అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు స్వతంత్రంగా నిర్ధారించబడలేదు. అక్రమ నిర్మాణాలు పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, అత్యవసర సేవలకు ఆటంకం, అగ్నిప్రమాదాల సమయంలో ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. మల్కాజిగిరి సర్కిల్‌లో జరుగుతున్న నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రతి అనుమతిని పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు బాధ్యులైన వారిపై, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై నిష్పాక్షిక విచారణ జరిపి, తప్పులు రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయం, పట్టణ ప్రణాళిక పరిరక్షణ కోసం అక్రమ నిర్మాణాలపై వెంటనే ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది.

## అనాథ చిన్నారులకు అండగా కృష్ణ గోపాల్ సేవా సమితి



**ఎల్.బి.నగర్, జూలై 17 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా హరి బాబు సహకారంతో వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న చిన్నారులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 275 మంది చిన్నారులు పాల్గొని అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, చిన్నారుల పట్ల సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణ భగవంతుడి ఆశీర్వాదంతో, ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ, అవసరమైన వారికి తోడుగా నిలవడం సమితి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనాథలు, నిరాశ్రయులు మరియు వృద్ధుల సంక్షేమం కోసం సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, దాతలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మీల్స్ ఆన్ వీల్స్" కార్యక్రమానికి వందనపు రాంబాబు ఆర్థిక సాయం



**గుర్రంపోడు, జూలై 17 (నేటి దర్శిని):** సమాజంలో ఆకలితో అలమటించే వేలాది మంది పేదలు, రోగులు, వారి సహాయకులకు ఉచిత అల్పాహారం అందించడమే ప్రధాన లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు వందనపు రాంబాబు అన్నారు. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీల్స్ ఆన్ వీల్స్" అన్నదాన కార్యక్రమానికి ఆయన తన దాతృత్వాన్ని చాటుకుంటూ భారీ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వందనపు రాంబాబు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండలో ప్రతిరోజూ వందలాది మంది నిరుపేదలకు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే రోగుల సహాయకులకు ఉచితంగా నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించడం గొప్ప విషయమన్నారు. తన జన్మదినం నాడు ఇలాంటి నిరంతర అన్నదాన మహాయజ్ఞానికి సహాయం అందించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, మనస్సుకు ఎంతో తృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా పేద ప్రజల ఆకలి తీర్చడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మరియు స్థానిక ముఖ్య నాయకులు పాల్గొని వందనపు రాంబాబుకు శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మిస్ తెలంగాణ యూనివర్స్-2026 విజేత హసిత నారాయణ భట్ట



**దిల్‌సుఖ్‌నగర్, జూలై 17 (నేటి దర్శిని):** దిల్‌సుఖ్‌నగర్‌లోని లక్మే అకాడమీ పవర్డ్ బై అప్‌టెక్ లో నిర్వహించిన ప్రత్యేక "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో పాల్గొని 100 మందికి పైగా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో హసిత తన సాధారణ నేపథ్యం నుంచి రాష్ట్ర స్థాయి అందాల పోటీలో విజేతగా ఎదిగిన ప్రయాణాన్ని పంచుకుంటూ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం విజయానికి మూల సూత్రాలని వివరించారు. ముఖ్యంగా యువతులు తమ లక్ష్యాలను ధైర్యంగా సాధించాలని, విద్య ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. అందాల రంగం, ఫ్యాషన్ పరిశ్రమలో రోజురోజుకూ పెరుగుతున్న అవకాశాలను వివరించిన హసిత, విద్యార్థులు సృజనాత్మకత, వ్యాపార దృక్పథం, ఔత్సాహికతతో కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అప్‌టెక్ లిమిటెడ్ గ్లోబల్ రిటైల్ బిజినెస్ చీఫ్ సందీప్ మాట్లాడుతూ.. "లక్మే అకాడమీలో విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా అందిస్తున్నామని అన్నారు. హసిత నారాయణభట్ట వంటి విజయవంతమైన వ్యక్తులతో విద్యార్థులను అనుసంధానం చేయడం ద్వారా వారికి మరింత ప్రేరణ లభిస్తుందని, వారు భవిష్యత్తులో అందాల రంగంలో నాయకులుగా ఎదగడానికి ఇది దోహదపడుతుంది" అన్నారు. లక్మే అకాడమీ దిల్‌సుఖ్‌నగర్ సెంటర్ డైరెక్టర్ మాధవ రెడ్డి మాట్లాడుతూ, "హసిత నారాయణ భట్టను మా అకాడమీకి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని,. ఆమె విజయగాథ విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశ్రమ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యమని అన్నారు.

# ఉప్పల్ తోపుడు బండ్ల వ్యాపారులకు నష్టం లేకుండా.. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు..!

**- హైడ్రా, ట్రాఫిక్ పోలీసులతో కలిసి నల్ల చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి**



**నాగారం, జూలై 17:- (నేటి దర్శిని):** ఉప్పల్ నల్ల చెరువు ప్రాంతంలో ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులకు నష్టం లేకుండా చూడనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే సమయంలో వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా చర్యలు చేపట్టనున్నట్లుగా తెలిపారు. ఉప్పల్ నల్ల చెరువు ప్రాంతానికి రింగ్ రోడ్డులోని బస్టాప్ తరలింపు, ఇదే ప్రాంతంలో రహదారి విస్తరణ నేపథ్యంలో రహదారి పక్కన ఉన్న తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయం మార్గాలను అన్వేషించడానికి పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం హైడ్రా అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి నల్ల చెరువు ప్రాంతంలో పర్యటించారు. ప్రత్యామ్నాయ చర్యలు గురించి చర్చించారు. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగరాజు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

# అధికారుల అండతో అక్రమ రిసార్ట్ నిర్మాణం..!?





- లంచాలు ఇస్తే ఏ నిర్మాణమైనా చెల్లుబాటేనా.?
- తుర్కయంజాల్ టౌన్ ప్లానింగ్
- అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు..!
- బ్రాహ్మణపల్లి వాడ ఏవిఎన్ కాలేజీ సమీపంలో భారీ అక్రమ రిసార్ట్ నిర్మాణం
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలకు తూట్లు
- వెంటనే కూల్చివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్





**తుర్కయంజాల్,జూలై17 (నేటి దర్శిని):** తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం కళ్లు మూసుకుని వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రోజురోజుకూ తీవ్రం అవుతున్నాయి. బ్రాహ్మణపల్లి వాడలో ఏబీఎన్ కాలేజీ సమీపంలో భారీ స్థాయిలో రిసార్ట్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యమా.? లేక లంచాల కోసం అక్రమాలకు అండగా నిలుస్తున్నారా.? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం నిర్మాణాలకు అనుమతులు, ల్యాండ్ యూజ్, సెట్బ్యాక్‌లు, పార్కింగ్, పర్యావరణ ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించి మాత్రమే నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలి. అయితే ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం వేగంగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్కసారి కూడా పరిశీలించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది సాధారణ నిర్లక్ష్యం కాదని అధికారుల బాధ్యతారాహిత్యం పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం కొంతమంది అవినీతి అధికారులకు భారీ మొత్తంలో లంచాలు చెల్లిస్తే ఎలాంటి నిర్మాణమైనా ప్రశ్నించరనే పరిస్థితి నెలకొంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వాటికే రక్షణగా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులే వాటిని ఉల్లంఘించే వారికి అండగా నిలిస్తే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర ఆదాయం భారీగా నష్టపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కొందరు అక్రమార్కులు కోట్ల రూపాయలు సంపాదిస్తుంటే అధికారులు మౌనంగా ఉండటం వెనుక అసలు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రిసార్ట్‌కు అన్ని చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా.? లేక అధికారుల అండతోనే అక్రమంగా నిర్మాణం కొనసాగుతోందా.? అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు, లేఅవుట్ వివరాలు, పన్ను చెల్లింపులు, టౌన్ ప్లానింగ్ అనుమతులను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. తుర్కయంజాల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినా స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ప్రభుత్వం అవినీతిపై కఠిన వైఖరి అవలంబిస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు మాత్రం అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్రాహ్మణపల్లి లో నిర్మాణంలో ఉన్న ఈ రిసార్ట్‌పై వెంటనే సమగ్ర విచారణ నిర్వహించి, అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినట్లు తేలితే ఆలస్యం చేయకుండా కూల్చివేయాలని, బాధ్యులైన యజమానులతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై కూడా శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. "అక్రమాలకు అండగా నిలిచే అధికారులపై చర్యలు లేకపోతే ఇలాంటి నిర్మాణాలు మరింత పెరిగి ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది" అని వారు హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు: ఎంఆర్పీఎస్ హెచ్చరిక



**నిడమానూరు, జూలై 17 (నేటి దర్శిని):** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని ఎంఆర్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిడమానూరు మండల విద్యాశాఖ అధికారికి ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో బొజ్జ చిన్న మాదిగ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జ చిన్న మాదిగ మాట్లాడుతూ, సాగర్ నియోజకవర్గంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాంటి విద్యాసంస్థలపై వెంటనే తనిఖీలు నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్న ఆయన, రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ స్కూళ్ల హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, పారిశుద్ధ్య సౌకర్యాల కొరత కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. భద్రతా సమస్యలు, నిధుల విడుదలలో జాప్యం వంటి అంశాలను ప్రభుత్వం విస్మరించకుండా విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలని కోరారు.

అదేవిధంగా, రాష్ట్రంలోని 24 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, టీచింగ్ మరియు నాన్-టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నప్పటికీ, భవిత కేంద్రాల కొరత, అవసరమైన నియామకాలు జరగకపోవడం వల్ల చాలామంది విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్యకు తగిన అవకాశాలు లేకపోవడం బాధాకరమని, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో దివ్యాంగ విద్యార్థులకు అదనపు సీట్లు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యోగులు కీలక పాత్ర పోషించినప్పటికీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యోగాల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిమళ్ల సత్యనారాయణతో పాటు పలువురు ఎంఆర్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సభ విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పిలుపు



**ఎల్బీనగర్, జూలై 17 (నేటి దర్శిని):** నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో జూలై 18న ఉదయం 10 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సభ"ను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని డివిజన్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఇచ్చిన ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తు, ఉపాధి అవకాశాల సాధన లక్ష్యంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, యువత సమస్యలపై పార్టీ భవిష్యత్ కార్యాచరణను సభ వేదికగా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, అధిక సంఖ్యలో ప్రజలను సమీకరించాలని దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు.

### స్నేహితుల సర్‌ప్రైజ్‌తో

# సమంత సీమంతం..

**కుటుంబ వేడుకలో ఎమోషనల్ మూమెంట్స్ వైరల్!**



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజులుగా సమంత గర్భధారణపై వార్తలు వినిపిస్తుండగా, ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ కార్యక్రమంలో ఆమె బేబీ బంప్‌తో కనిపించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లకు విరామం ఇచ్చి కుటుంబంతో కలిసి ఈ ప్రత్యేక సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తోంది. నటిగా వరుస విజయాలతో కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభించిన సమంతకు, ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ఆనందం చేరువైంది. కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగిన ఈ సీమంతం వేడుక ఆమె జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోనుంది. అభిమానులు కూడా తల్లి కాబోతున్న సమంతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

# అజిత్ సినిమా కీలక పాత్రలో కయాదు లోహర్ ?



అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.




# క్వాలిటీ కథలకే ఓటేసిన కృతి సనన్..

కెరీర్ మొదలుపెట్టి పుష్కరం దాటిపోయింది. కావాల్సినంత డబ్బులు, రావాల్సినంత పేరు వచ్చేసాయి.. అయినా కూడా ఇప్పటికీ పిచ్చి పిచ్చి సినిమాలెందుకు చేయడం అంటున్నారు ఓ హీరోయిన్. వయసైపోతోందని ఏది పడితే అది చేయకుండా.. కెరీర్‌పై ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. క్వాంటిటీ కాదు క్వాలిటీయే ముఖ్యం అంటున్నారామె. మరి ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మ..? పుష్కరం కింద నేనొక్కడినేతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతి సనన్.. ఆ తర్వాత హిందీలో టాప్ హీరోయిన్‌గా మారిపోయారు. అప్పట్లో ఖాళీగా ఉండకూడదని ఏ ఛాన్స్ వస్తే అది చేసుకుంటూ వెళ్లిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం కథ నచ్చితేనే డేట్స్ ఇస్తానంటూ గట్టిగా చెబుతున్నారు. బాలీవుడ్‌లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకుని కాన్ఫిడెంట్‌గా దూసుకుపోతున్నారీమే. వచ్చిన ప్రతి సినిమాను ఓకే చేసే రోజులకి గుడ్‌బై చెప్పేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు రూట్ మార్చి క్వాలిటీకే ఓటేస్తోంది. తనకు నిజంగా కిక్ ఇచ్చే కథలనే ఎంచుకుంటూ.. రిజల్ట్ గురించి టెన్షన్ పడకుండా బిందాస్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం తన కెరీర్, లైఫ్‌లో ఎక్సైటింగ్ ఫేజ్ నడుస్తోందని తెలిపారీమే. ఇక్కడి దాకా వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉందని ఫుల్ జోష్‌లో చెప్తున్నారు కృతి. పర్సనల్ లైఫ్‌లోనూ కృతిసనన్ తీసుకున్న ఓ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు. వయసైపోతుందేమో, త్వరగా పెళ్లి చేసుకోవాలేమో అనే టెన్షన్ లేకుండా.. కెరీర్‌పై ఫోకస్ చేయడానికే ఎగ్స్ ఫ్రీజ్ చేయించుకున్నట్లు ఓపెన్‌గా చెప్పారు. ఏ ప్రెషర్ లేకుండా ఫుల్ ఫ్రీడమ్‌తో కెరీర్‌ను ఎంజాయ్ చేస్తున్నారీమే. మొత్తానికి ఈ టైమ్‌లో తనకు క్వాంటిటీ కాదు కథల్లో క్వాలిటీ కావాలంటున్నారు కృతి.

### NBK111'

# రిలీజ్ డేట్ ఫిక్స్?

**పభాస్ 'ఫౌజీ'తో క్లాష్ తప్పించుకునే ప్లాన్‌లో బాలయ్య టీమ్!**



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చీదీఖ111 పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ హైప్ ఏర్పడింది. ముఖ్యంగా బాలయ్య స్టైలిష్ మాస్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని కొత్త స్టైలిష్ అవతారంలో గోపీచంద్ మలినేని చూపించబోతున్నారని గ్లింప్స్ ద్వారానే స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా కోసం బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు 'చీదీఖ111' విడుదల తేదీ గురించిన చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సినిమాను డిసెంబర్ తొలి వారంలోనే విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ' డిసెంబర్ 3న విడుదల కానుందని అధికారికంగా ప్రకటించడంతో మేకర్స్ తమ వ్యూహాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ప్రభాస్ సినిమాతో పోటీ పడకుండా, క్రిస్మస్ హాలిడే సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేస్తే కలెక్షన్లకు మరింత అనుకూలంగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. క్రిస్మస్ సెలవులు, అనంతరం న్యూ ఇయర్ హాలిడేస్ కలిసి రావడం వల్ల సినిమాకు లాంగ్ రన్ దక్కే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో బాలకృష్ణ మరోసారి తన మాస్ పవర్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్, బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, హై వోల్టేజ్ ఎలివేషన్ సీన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే డిసెంబర్ 25 విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రిలీజ్ డేట్ ఖరారైతే, ఈ క్రిస్మస్ సీజన్‌లో బాలయ్య అభిమానులకు మరో భారీ సినీ పండుగ ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గుండెజబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు!



ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్‌ఎన్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ తెరకెక్కించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్'. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడు తూ "ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూ పొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతు న్నాం. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థి యేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఇది కుటుంబ సమేతంగా థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఒక భయానక చిత్రం"అని అన్నారు.


**Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365**